# సీత చెప్పిన కథ

సీతకి పెళ్ళి కుదిరింది. ఇంట్లో ఆనందం వెల్లివిరిసింది. నిజానికి పెళ్ళి కుదరడం కష్టం అయేలాంటి పిల్ల కాదు సీత. చక్కని చుక్క ఇకనా మిక్స్‌లో ఎం.ఏ. చేసింది. బుద్ధిగా పొందికగా వుంటుంది. అలాంటి సీతకి పెళ్ళి కుదరడం అబ్బురం కాకపోయినా, ఇంట్లో అందరూ సీత అదృష్టవంతురాలనే సంబరపడిపోతున్నారు. సీత వరుడు పెద్ద రచయిత కావడం ఈ సంబరానికి కొంత కారణం. చాలా చిన్న వయస్సులో ఆంధ్రదేశమంతటా పేరు గడించి అందరి నోట్లో నానే రచయిత అతను. అసలు పేరు ఆంజనేయశాస్త్రి అయినా "చందన్" అనే పేరుతో ప్రతివారికి పరిచితుడు.

ఒకరోజు క్లాసులో ఒక కథ గురించి సరోజ, బాలభవాని పెద్ద వాగ్వివాదం పెట్టుకుని, గొడవపడి దెబ్బలాడుకుని, ఒకరితో ఒకరు మాటలు మానేసుకున్నారు. ఆ రోజు సీతకి చాలా చిరాకేసింది. అసలీ కథలు రాయడం, దాని గురించి గొడవ పడడం తెలివితక్కువ అనిపిస్తుంది. అంతే కాదు. ఈ కథలు పత్రికల్లో పడడం మీద సీతకి ఒక అభిప్రాయం వుంది. జైల్లో ఖైదీలు కుర్చీలు, బల్లలు, తివాసీలు, దుప్పట్లు తయారుచేసి బయటికి సరఫరా చేసినట్లే ప్రెస్సు అనే ఖైదులో కొంత ముఠా ఉండి ఇలాంటి కథలు, కబుర్లు ప్రింట్ కొట్టి బయట ప్రపంచం మీదకి వదిలిపెడతారని ఆమె నమ్మకం.

అందుకే తన క్లాస్‌మేట్ సుజాత కథలు పత్రికల నుంచి తిరిగొస్తే, ఆమెకి విషయం చెప్పి హితబోధ చేసింది. అయితే సుజాత నవ్వేసి తేలిగ్గా తీసిపారేయడంతో వాళ్ళు మండిపోయి వూరుకుంది.

ఒక్కరోజు మాత్రం సీత ఎలాగైనా ఒక కథ చదవాలని ఒక పత్రిక తీసుకుని కూర్చుంది. ఆమెకి సాధ్యం కాలేదు. తాటికాయంత అక్షరాలతో కథ మొదలుపెడితే ఆ నాలుగు పంక్తులూ చదివింది. ఆ తర్వాత ఒక పేరా చదవడం గగనమైపోయింది. చదివిన వాక్యమే చదివి అర్థంకాక విసిగిపోయి ఆ పుస్తకం విసిరేసి పక్కమీద వొరిగిపోయింది. ఆ రోజు కలలు, కలతలు లేకుండా హాయిగా నిద్రపట్టేసింది అప్పుడనుకుంది. కథలు చదవడం నిద్రపట్టడానికి మందు మాత్రమే అని. అయితే సీతకి నిద్రపట్టకపోవడమనే ప్రశ్నే లేదు. ఆమె ఎప్పుడు కావాలంటే అప్పుడు అయిదు నిమిషాలు ప్రయత్నించి నిద్రలోకి జారుకుని ఆరుగంటలు నిద్రపోగలదు. నిజానికి, ఆమెకున్న హాబీ అల్లా నిద్రపోవడమే. మరీ ఎప్పుడైనా తోచకపోతే చీరలన్నీ వుతుక్కుని గంజిపెట్టి ఆరేసి ఇస్త్రీ చేసుకుని బీరువాలో సర్దుకోవడం – ఆ అలసటతో మళ్ళీ పడుకోవడం. అంతే సీత హాబీ.

సీత ఎమ్.ఏ. వరకు శ్రద్ధగా చదివింది. బుద్ధిమంతురాలిగా అన్నీ పాసవుతూ వచ్చింది. ఎమ్.ఏ.లో కూడా ఏదో రెండు మార్కులు తగ్గడం వల్ల సెకండ్ క్లాసు వచ్చింది కానీ, నిజానికి ఆమె ఫస్ట్‌క్లాస్ స్టూడెంటే.

ఆంజనేయశాస్త్రి చదువుకున్న వాడని, బ్యాంకిలో మంచి ఉద్యోగంలో వున్నాడని, కులం, గోత్రం అన్నీ సరిపోయాయని ఈ సంబంధం చూశారు పిల్లవాడు వచ్చి, సీతని చూసుకుని వెళ్ళాక క్రమక్రమంగా అతని పేరూ ప్రఖ్యాతి వీళ్ళకి తెలిసింది. అందుకు కాస్త ఆనందించారు. కాని ఎగిరి గంతేయలేదు. సీతవాళ్ళ నాన్నగారికి కవులన్నా, నాటకాలు వాళ్ళన్నా, గాయకులన్నా భయం, చిరాకు. వాళ్ల సంసారం పట్టకుండా రిజాలాగా వుంటారని ఆయనకి నమ్మకం. ఆస్తి వుంది కదాని ఒక నాటకాల రాయుడికిచ్చిన తన మూడో మేనత్త పోయేవరకు పుట్టింటిలోనే వుండడం ఆయనకి తెలుసు. అందుకే ఆయనకి కళాకారుల మీద నిశ్చయమైన అభిప్రాయాలే తప్ప భ్రమలేమీ లేవు.

సీత బద్ధకంగా కూర్చుని ఆలోచిస్తోంది. ఆలోచిస్తోందని చెప్పడం కూడా కష్టం. నిశ్శబ్దంగా కూర్చుంది కనక ఆలోచిస్తోందేమో అనుకోవాలి కాని అలా కూర్చునే, చేపలా కళ్ళు తెరిచే సీత నిద్రపోగలదు. ఈ విషయం ఎవ్వరికీ తెలీదు. బహుశః ఆమెకి కూడా తెలీదేమో!

"హాయ్ సీతా!" అంటూ ఊడిపడింది సరోజ. సీత మరింత బద్ధకంగా సరోజకేసి చూసింది.

"అబ్బ, ఇలా వున్నావేమిటి? ఇంత డల్‌గా! అసలు నిన్నెలా అభినందించాలో తెలీకుండా వుంది. హౌలక్కీ యు ఆర్! 'చందన్' అంటే ఎవరనుకున్నావ్? మనకున్న ముగ్గురు పాపులర్ రచయితల్లో ఒకరు. అతని కథలు, అబ్బ! నే చెప్పలేను. నువ్వు చదవాలి! అందులో అందాలు అనుభూతులు గ్రహించాలి" అంది పరవశంతో ఊగిపోతూ.

సీత మరీ డీలా పడిపోయింది. "ఏం చెప్పాలి సరోజకి" అని ఆలోచనలో పడింది. అదేం పట్టించుకోకుండా "అసలు నువ్వేం చదివావు అతని కథలు! చెప్పు!" అని నిలేసింది పక్కన కూర్చుని సరోజ.

తనేం చదివిందని చెప్తుంది? అసలు ఏ రచయిత కథా తను చదవలేదు. ఈ 'చందన్' గురించి తనేం చెపుతుంది?

"నేనేమీ చదవలేదు. అతనివే కాదు, నేనెవ్వరినీ చదవలేదు" అంది ధైర్యంగా. సరోజ సీతని ఒక హంతకురాల్ని చూసినట్లు చూసింది, హత్య చూసినప్పుడు నోట మాటరాని ప్రత్యక్షసాక్షిలా అవాక్కయి పోయింది. ఆమెలో సీతమీద జాలి, అసూయ ఒక్కసారే కలిగాయి. ఇలాంటి మొద్దుని తీసికెళ్ళి అతనికిచ్చి ఎందుకింత సామాజిక ద్రోహం చేస్తున్నారు? అని ఎంతో విశాలంగా విలపించింది.

సీత ఏమీ మాట్లాడకుండా కూర్చుంది ఒక నిశ్చయానికొచ్చిన సరోజ సీతకి గీతోపదేశం చెయ్యక తప్పదని, మొదలుపెట్టింది.

"సీతా! నీ భర్త నిన్ను అనురాగంతో చూడాలంటే, ప్రేమించాలంటే, నువ్వు అతని రచనలు చదవాలి, ప్రోత్సహించాలి, మెచ్చుకోవాలి. అతని కీర్తిలో పాలుపంచు కోవాలి. అప్పుడే నీకు అతను తన జీవితంలో సరైన స్థానం యిస్తాడు. అయినా ఇదేం దౌర్భాగ్యమే! ఇంత చదువుకున్నావ్ సాహిత్యం అంటే అంత విరక్తి ఎలా వచ్చింది?" అంది తోటకూరలో పురుగుని చూసినట్లు చూస్తూ. ఈ మాటలకి సీత చలించి పోయింది. తన భర్త తనని ప్రేమించకపోతే తను భరించగలదా! అతను తననుకాదని మరోప్రాణిని ఇష్టపడితే తను సహించగలదా? కాదు, అలా తను ఒప్పుకోలేదు. మరేం చెయ్యాలి? ఎలాగైనా ఇప్పుడు అతని పుస్తకాలు ఒకటి రెండైనా చదవాలి. అమ్మబాబోయ్! చదవటం మాట తలచుకుంటేనే ఏడుపొస్తోంది. ఇన్నాళ్ళు చదివి చదివి ఈ పరీక్షలు ప్యాసయ్యింది. మళ్ళీ తనకీ పెద్ద పరీక్ష ఏమిటి దేవుడా అని మనసులోనే వాపోయింది.

"మరిప్పుడేం చెయ్యాలి?" అంది గద్గదికంగా.

సరోజ నవ్వేసింది. "ఎగిరి గంతేసి పుస్తకాలు తెప్పించి చదివి పారేయక ఈ ఏడుపేమిటీ" అంది.

"ముహూర్తం వారం రోజులుంది. ఇప్పుడతని పుస్తకాలు చదివితే అంతా గేలి చేస్తారు. పైగా నేను త్వరగా చదవలేను. నాకు కథలు అంత బాగా అర్థం కావు" అంది బేలగా సీత. ఆమె ముఖం చూస్తే ఏడుపొక్కటే తరువాయిగా వుంది.

సరోజ కాసేపు తీవ్రంగా ఆలోచించి, ఒక నిశ్చయానికొచ్చి-

"అయితే నేను చెప్పినట్లు చేస్తావా?" అంది.

"అలాగే" తలూపింది సీత.

"ఇదంతా నీకోసమే. ఎందుకంటే మొదటి పరిచయంలోనే అతనికి నువ్వు మనసా చేరువైపోవాలి" అంది సరోజ పెద్ద అరిందలా. సీత బలి కాబోతున్న మేకపిల్లలా తలొంచుకుంది.

"అతని కథల్లో, 'ది బెస్ట్' టాప్ రాంక్ కథలు ఒక రెండు చెప్తాను. అవి బాగా అర్థం చేసుకో. నాలుగైదుసార్లు మననం చేసుకో. నువ్వు అతన్ని కలిసినప్పుడు మీ రచనలంటే నాకెంతో యిష్టం అని ముద్దు ముద్దుగా చెప్పు - అలా చెప్తూ ఈ రెండు కథలూ చెప్పు- పోనీ అందులో ఒకటి చెప్పు - చాలు. అతను ఆనంద పారవశ్యంతో కరిగిపోయా..."

"ఇక చాల్లే, కథ చెప్పు" అంది సీత అక్కడితో సరోజని ఆపకపోతే శ్రుతి మించుతుందనే భయంతో.

"అసలు నీకు చిన్నప్పుడు అమ్మమ్మ చెప్పే కథలైనా గుర్తున్నాయా" అంది ఇదేదో ఎంట్రన్స్ టెస్టులాగా.

"రాజు గారి ఏడుగురు కొడుకులు - ఏడు చేపలు - కథ గుర్తుంది. ఈగ ఇల్లు అలుకుతూ పేరు మర్చిపోతుందే..."

"ఓ.... చాలు తల్లీ చాలు, నీ అద్భుత జ్ఞాన సంపదకి జోహార్లు" అంది ఎగతాళిగా.

అని, కథ చెప్పడం మొదలుపెట్టింది. ఎంతో అందంగా, రమ్యంగా కళ్ళముందు బొమ్మలు కదులుతున్నట్టు - సంఘటనలు జరుగుతున్నట్టు చెప్తోంది. సీత చేరడేసి కళ్ళతో సరోజనే చూస్తూ ఆ కథ అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఇకనామిక్స్ కంటే, కథలే కష్టమనిపిస్తోంది. మళ్ళీ మళ్ళీ అనుమానాలు అడుగుతూ, వెనుక ముందు కథ చెడిపోకుండా మనసుకి పట్టించుకొంటోంది.

సరోజకి కథ చదవడమన్నా, తనకి నచ్చిన కథ ఎవరికైనా చెప్పడమన్నా ఎంతో యిష్టం. అప్పుడు ఆమె పొందే ఆనందం వర్ణించడం కష్టం. సీతకి రెండు కథలూ చెప్పింది. అందులో మొదటిది సీతకి కూడా నచ్చింది. కథలు కూడా ఇంత హాయిగా వుంటాయన్న మాట అనుకుంది. అదే బాగా మనసుకి పట్టింది. రెండో కథ బాగున్నా అది కూడా గుర్తుంచుకోవడం సీతకి కష్టమైంది. ఆ మాట పైకి చెపితే సరోజ కొట్టుతుందేమోనని నోరు మూసుకుంది.

❖ ❖ ❖

పెళ్ళి వైభవంగా జరిగిపోయింది. వరుడి తరఫున రచయిత స్నేహితులు, పత్రికాధిపతులు, ఎందరో సాహిత్యాభిమానులు చాలామంది వచ్చారు. అంతా ఆంజనేయశాస్త్రిగా కాకుండా 'చందన్'గా ఎన్నో అభినందనలు తెలిపారు. ఎన్నో పుస్తకాలు బహూకరించారు. చక్కని సీతని చూసి అంతా అతన్ని పొగిడారు. సీత స్నేహితురాళ్ళు ఆమెని ఆకాశానికి ఎత్తేశారు.

"ఈ మొద్దుకి ఇంత మంచి మొగుడెలా దొరికాడే!" అని ఒకరు,

"ఇకనైనా ఈ జడ పదార్థం కాస్త మారితే బాగుండును" అని మరొకరు– అంతా ఆమెను ఆట పట్టించారు. పెళ్ళి పందిరి పల్చబడింది. అంతా ఎక్కడివాళ్ళక్కడకు వెళ్ళిపోయారు.

"సీతమ్మా – నీ మొగుడికి చాలా పేరుందేవ్; ఎంతమంది వచ్చారని, ఎంత పొగిడారని; ఏమోలే – నువ్వు అదృష్టవంతురాలివే. కాస్త జాగ్రత్తగా మసులుకో. అతను చెప్పింది అవునంటే కాదనకు" అంది సీత తల్లి అభిమానంగా సీతకి పూలజడ వేస్తూ. సీతకి క్రమంగా తనెంత అదృష్టవంతురాలో అర్థమౌతోంది.

❖ ❖ ❖

"రా సీతా, అలా దూరంగా నిలబడిపోయావేం? నువ్విలా బిడియంగా పాతకాలపు అమ్మాయిలా వుండడం నాకిష్టం లేదు. నువ్వు నాతో స్వేచ్ఛగా, స్నేహంగా కబుర్లు చెప్పడం నాకిష్టం" అన్నాడు రచయిత భర్త. సీత కళ్ళు ఎత్తి అతనికేసి చూసింది. అతను స్నేహంగా నవ్వుతున్నాడు. సీత తన కర్తవ్యం గుర్తుకొచ్చినట్లు రెండు అడుగులు నెమ్మదిగా వేసి –

"నాకు మీ కథలంటే చాలా యిష్టం" అంది. అప్పుడామె కంఠం వొణికింది. అది సిగ్గుగా కొట్టుకుపోయిందా క్షణంలో –

"నిజంగానా! అయితే నేను చాలా లక్కీ ఫెలోనన్నమాట" అంటూ ఆమె చెయ్యి పుచ్చుకుని తన పక్కన కూర్చోబెట్టుకుని–

"ఏదీ – నా కథల్లో నీకేది యిష్టమో చెప్పు చూద్దాం" అన్నాడు. రాత్రంతా చదివిన ప్రశ్నే పరీక్ష పేపర్లో కనిపించిన విద్యార్థిలా సీత తను వారం రోజులుగా మననం చేస్తున్న కథ చెప్పేసింది. అతను ఓరకంట అందమైన భార్యని చూసి ఫకాలున నవ్వేసి సీతని గట్టిగా కౌగలించేసుకుని "నాకు నీలాంటి అమాయకురాలైన భార్యే కావాలి" అన్నాడు చెవిలో.

అంత త్వరగా పరీక్షా ఫలితం తెలిసినందుకు అతని హృదయ సామ్రాజ్యం తాను సులభంగా గెల్చుకున్నందుకు ఉబ్బి తబ్బిబ్బయిపోయింది సీత.

❖ ❖ ❖

మర్నాడు ఎండవేళ చెమటలు కక్కుతూ వచ్చింది సరోజ.

"ఏమిటే ఇలా ఊడిపడ్డావ్" అంది సీత. ఆమె ముఖంలో కనిపిస్తున్న వెలుగు, ఆనందం సరోజకి తృప్తినిచ్చాయి. అయినా పక్కకి పిల్చి "మీ ఆయనకి కథ చెప్పావా" అంది రహస్యంగా. మళ్ళీ సీత జవాబు వినకుండానే –

"చెప్తే ఆ రెండో కథ చెప్పు. మొదటిది నేను పొరపాటుగా చెప్పాను. అది "చందన్"ది కాదు; "వసుంధర"ది అంది సరోజ.

ఆ తర్వాత ఏవేవో మాట్లాడినా ఆ మాటలేవీ సీతకి వినిపించలేదు.